www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 09 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

## జనగణన ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి




**-అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జనగణన కార్యక్రమాన్ని ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గృహ సముదాయాల బ్లాక్‌లు గుర్తించి సియంయంఎస్ (సెన్సెస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం) పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం

మిగతా 2లో..

# చేను మేస్తున్న కంచ..!

**-అక్రమ పర్మిట్లతో చెట్ల నరికివేత**
**-అటవీ శాఖలో అక్రమ అనుమతులు**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న నిర్మల హృదయ డిగ్రీ కళాశాల దాని పరిసరాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా పచ్చని చెట్లు నరికి ట్రాక్టరలో లోడ్ చేస్తున్నారని ఫారెస్ట్ అధికారులకు సమాచారం చేరింది. ఈ సమాచారంలో ఫారెస్ట్ అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి ట్రాక్టర్‌ను కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. అందులో వేప మొద్దులతో పాటు ఇతర అటవీయేతర జాతుల కలప కూడా ఉంది. పట్టుకున్న గంట తరువాత ఫారెస్ట్ అధికారులు ఓ ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా అందులో అటవీయేతర జాతులకు సంబంధించిన కలప మాత్రమే ఉంది కాబట్టి వాటికి కూడా వారు అనుమతులు తీసుకోలేదు కాబట్టి పది వేల రూపాయల జరిమానాను కలప వ్యాపారి బందెల్లికి విధించి ట్రాక్టర్‌ను విడిచి పెడుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌లో అటవీ జాతికి చెందిన వేప కలన ఉన్నప్పటికీ ఆ కలపలేదని నిర్ధారిస్తూ ఫారెస్ట్ అధికారులు అక్రమానికి పాల్పడ్డారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి

మిగతా 2లో..



## విచారణకు పిలవడం అప్రజాస్వామికం




**-ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నం**
**-ప్రజల పక్షాన పోరాటం ఆగదు**
**-సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రజల పక్షాన పనిచేస్తున్న వారిని కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణకు పిలవడం అప్రజాస్వామిక చర్య అని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న తనను విచారణకు పిలవడం ప్రశ్నించే గొంతును నొక్కేయడమేనని ఆయన తెలిపారు. విచారణకు పిలవడం కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పోటు రంగారావును ఈనెల 22న విచారణకు హాజరు కావాలని నోటీసు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోటు రంగారావు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో పని చేస్తున్నానని ప్రస్తుతం తనపై ఎటువంటి కేసులు లేవన్నారు. కానీ రాజద్రోహం లాంటి కుట్ర చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఉన్న విషయాన్ని బహిర్గతం చేస్తూ తమ పార్టీ ప్రజల్లో పనిచేస్తుందని కుట్రకు ఆస్కారమే లేదని ఆయన స్పష్టం చేశారు. అర్బన్ నక్సలైట్ల పేరుతో ప్రశ్నించే వారిని, ప్రజల పక్షాన పని చేసే వారిని నిలువరించే ప్రయత్నం చేస్తున్నారని ఆ క్రమంలోనే తనను విచారణకు పిలిచారని ఆయన తెలిపారు. కొందరిపై

మిగతా 2లో..

- అర్హత లేకున్నా రేషన్ కార్డులు పొందిన వారి గుర్తింపు
- జిల్లాలో విచారణ చేపడుతున్న అధికారులు
- 7213 అక్రమ కార్డులు ఉన్నట్లు నిర్ధారణ
- పరిశీలించి రద్దు చేయనున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 257252 రేషన్ కార్డులు



# అనర్హుల ఏరివేత..!

దొడ్డిదారిలో అక్రమ రేషన్ కార్డులు పొందిన పలువురికి చెక్ పెట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా 257252 రేషన్ కార్డులు ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ లబ్ధిదారులకు ప్రతీ నెలా 4800 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అయితే కార్డుదారులు చాలా మంది రేషన్ షాపుల ద్వారా తీసుకున్న సన్నబియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దీనిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనర్హుల ఏరివేతకు శ్రీకారం చుట్టాయి. జిల్లా వ్యాప్తంగా అనర్హత గల రేషన్ కార్డులు 7213 ఉన్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు.

-ప్రజాపక్షం/కొత్తగూడెం

2లో

# చేను మేస్తున్న కంచె..!

(మొదటిపేజీ తరువాయి)

కొందరు పత్రికా విలేకరులు ఆ ట్రాక్టర్‌లో వేప కలపను చూసి ఫోటోలు కూడా తీసుకున్నారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ కలప వ్యాపారి వద్ద మామూలు తీసుకొని ట్రాక్టర్‌ను నామమాత్రపు జరిమానాతో వదిలేసారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కలప వ్యాపారి కేసు పరిశీలించాల్సిన ఫారెస్ట్ అధికారి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కాబట్టి ఏదైనా సాధ్యపడుతుందని, ఈ సంఘటనపై బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ సంఘటన ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతంలో జరిగింది కాదు అటవీ రేంజ్ కార్యాలయానికి అర కిలోమీటర్ దూరంలో మంగళవారం కారేపల్లిలో చోటు చేసుకున్న సంఘటన ఇది. కంచే చేను మేసిన చందంగా ఇలాంటి అక్రమాలు కారేపల్లి అటవీ రేంజ్‌లో కోకొల్లలుగా జరుగుతున్నా అటవీ శాఖ ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర వహించడంతో ఇక్కడ జరుగుతున్న అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందనే ఆరోపణలు ఉన్నాయి.

### అతిపెద్ద రేంజ్‌లో అడవులు అంతరించాయి....

జిల్లాలోనే అతిపెద్ద రేంజ్‌గా ఉన్న కారేపల్లి ఫారెస్ట్ రేంజ్‌లో అడవి ఆనవాళ్లు కోల్పోతోంది. రేంజ్ పరిధిలో 20వేల ఎకరాల విస్తీర్ణంలో దట్టమైన అడవులు నాడు నిండు పచ్చదనంలో వున్న అడవులు నేడు ఆక్రమణకు గురై కేవలం గుట్టలు మాత్రమే మిగిలివున్నాయి. ఫారెస్ట్ అధికారులు వాటిని కూడా కాపాడలేకపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటవీ భూములను, అటవీ సంపదను, ఏజెన్సీ ప్రాంతాల్లో పెరుగుతున్న పచ్చని చెట్లను కాపాడాల్సిన అటవీ అధికారులు మామూళ్లకు అలవాటు పడి అక్రమాలకు పాల్పడుతున్నారు.

### రంగురాళ్లబోడులో వందల చెట్లను నరికారు...

కారేపల్లి అటవీ రేంజ్ పరిధిలోని రంగురాళ్లబోడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో గత ఏడాది నుండి వందకు పైగా భారీ వృక్షాలను నరికి సుమారు పదెకరాల ఫారెస్ట్ భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతానికి చెందిన ఓ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రేమయంతోనే అటవీ భూమి అక్రమనకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఫారెస్ట్ ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టకపోవడంతో అక్కడి ఆక్రమణదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతోంది. రంగురాళ్లబోడు అక్రమణలపై ఇప్పటికే ఫారెస్ట్ ఇప్పటికే ఫారెస్ట్ అధికారులు 8 కేసులు నమోదు చేసినప్పటికీ కబ్జాదారులను కట్టడి చేయడంలో విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి. ఆరు నెలల క్రితం వరకూ ఇక్కడ పని చేసిన ఫారెస్ట్ సిబ్బంది కూడా కబ్జాదారులకు సహకరించారు కాబట్టి వారు వందలాది చెట్లు మిషన్లతో నరికారని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం రంగురాళ్లబోడు కబ్జాలను అరికట్టేందుకు సమర్ధవంతమైన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌ను వేసినప్పటికీ ఫారెస్ట్ ఉన్నతాధికారులు కఠిన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### అక్రమ పర్మిట్లు....

కారేపల్లి మండలంలో 41 గ్రామ పంచాయితీలో మండల కేంద్రమైన కారేపల్లి, అబ్బాయిగూడెం మినహా మిగతా అన్ని పంచాయితీలు ఏజెన్సీ గ్రామాలే. ఈ గ్రామాల పరిధిలోని వేప, చింత, తుమ్మ తదితర చెట్లను నరికి కలపను తరలించడానికి వాల్టా చట్టం ప్రకారం అనుమతులు లేవు. కానీ వందలాది ట్రిప్పుల కలప గత కొన్నేళ్లుగా ఈ ఏజెన్సీ ప్రాంతం నుండి తరలిపోతోంది. వీటిల్లో చాలా వరకు కారేపల్లి పేరుతో పర్మిట్లు ఇచ్చి కొందరు అటవీ శాఖ సిబ్బందే సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోనీ కలపను నాన్ ఏజెన్సీ గ్రామమైన కారేపల్లి పేరుతో పర్మిట్లు తీసుకుని పర్మిట్లు ఇచ్చిన వారికి కొంత ముట్ట చెప్పి గుట్టచప్పుడు కాకుండా ఈ అక్రమం కొందరి ఫారెస్ట్ సిబ్బంది కనుసన్నల్లోనే సాగుతోంది. నాన్ ఏజెన్సీ గ్రామమైన కారేపల్లి ప్రాంతం రొండు కిలోమీటర్ల పరిధితో తక్కువ విస్తీర్ణంలోనే ఉంది. ఈ పరిధిలో కొట్టిన చెట్లు నామమాత్రమే.

### 300 టేకు చెట్లు ఎలా తరలిపోయాయి...

కారేపల్లి అటవీ రేంజ్ ఆఫీస్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో పేరుపల్లికి చెందిన ఓ రైతు మల్లన్నగూడెం రోడ్డు ప్రాంతంలో పొలం గట్ల మీద సుమారు 300 చెట్లను పెంచాడు. ఈ చెట్లన్నీ పూర్తి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. ఎటువంటి అనుమతుల్లేకుండా ఈ చెట్లన్నీ మాయమై ఆ ప్రాంతంలో మొట్లు మాత్రం సాక్ష్యంగా మిగిలాయి. ఆ సాక్ష్యాలను కూడా లేకుండా ఇటీవల వాటిని కూడా తొలగించారు. ఈ చెట్లను నరికించి అక్రమంగా తరలించిన వ్యవహారం కూడా కొందరి ఫారెస్ట్ సిబ్బంది కనుసన్నల్లోనే జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. కారేపల్లి అటవీ రేంజ్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై ఫారెస్ట్ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## జనగణన ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి) కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జనగణన కార్యక్రమం పిఎన్‌జి గ్యాస్‌పైప్‌లైన్, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్లు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ శాఖాధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్‌ను తప్పని సరిగా నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో ల్యాండ్ మార్కులు, దేవాలయాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలలు తదితర గుర్తులను బ్లాక్ వారీగా స్పష్టంగా నమోదు చేయాలన్నారు. హౌజ్ లిస్ట్ బ్లాక్‌కు సంబంధించిన వివరాలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసి సమర్పించాలన్నారు. జనగణన రెండు దశల్లో జరుగుతుందని ప్రస్తుత సంవత్సరం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం మే 10 నుంచి ప్రారంభమవుతుందని ప్రతి ఇంటికి సంబంధించి వివరాలు సేకరించాలన్నారు. హౌజ్ లిస్టింగ్ ప్రకారం జనాభా వివరాలు సేకరణ చేయడం జరుగుతుందని ప్రతి 300 ఇండ్లు, 800 జనాభా ఒక బ్లాక్‌గా నిర్దేశించి జనాభా లెక్కలు చేసేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పట్టణ ప్రాంతాలలో హెచ్‌ఎల్‌బిలు మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు చేయనున్న హెచ్‌ఎల్‌బి పేపర్ మీద రిపోర్టు సిద్ధం చేసుకుని ఆన్‌లైన్ నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. జనగణన చాలా ముఖ్యమైన అంశమని దీనిని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారుల సురక్షిత, నిరంతర గ్యాస్ సరఫరాకు పిఎన్‌జి (పైప్డ్ న్యాచురల్ గ్యాస్) గ్యాస్ పైప్‌లైన్ వ్యవస్థకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని కలెక్టర్ తెలిపారు. దీని ద్వారా గృహాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకు సహాజ వాయువు నేరుగా పైపులైన్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు కేంద్రాల ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు, తూకం యంత్రాలు, గన్ని బ్యాగులు రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, సిపివో ఎ. శ్రీనివాస్, డిపివో రాంబాబు, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకూబ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శ్యాంకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విచారణకు పిలవడం అప్రజాస్వామికం

(మొదటిపేజీ తరువాయి) నమోదు చేసిన కుట్ర కేసులను తాను ఖండించానని నన్ను బెదిరించే క్రమంలో ఇటువంటి విచారణకు పిలిచారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తాము ఎప్పటికీ ఎండగడతామని బహిరంగంగానే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కుట్రకు తావెక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. గతంలో చాలా మందిని ఉ.పా చట్టం క్రింద అరెస్టు చేశారని రంగారావు గుర్తు చేశారు. ఇటువంటి కుట్ర పూరితమైన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కేంద్ర కమిటీ నాయకులు కెజి రాంచందర్, కె. రమా, కె. రంగారెడ్డి, మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య, కె.సూర్యం, ఎస్ఎల్ పద్మ, గుర్రం అచ్చయ్య, సివై పుల్లయ్య, అశోక్, జి.రామయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన షేక్ వలి (65) గ్రైండర్ రాళ్లకు కక్కులు కొడుతుంటాడు. బుధవారం తెల్లవారుజామున నడుచుకుంటూ సత్తుపల్లి కి వస్తుండగా తాళ్ళమడ శివారు గరారే ఫర్నిచర్స్ సమీపంలో గుర్తు తెలియని వాహనం డీ కొట్టడంతో తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులుకేసునమోదుచేసిదర్యాప్తుచేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని మాటూరు క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాటూరు క్రాస్ రోడ్డు బోర్డర్ వద్ద ప్రమాదవశాత్తు ఆర్టీసి బస్సు, ట్రాక్టర్‌ను ఢీకొన్న సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మాటూరు గ్రామానికి చెందిన శీలం శంకర్‌రెడ్డి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అనర్హుల ఏరివేత..!

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** పేదవానికి పట్టెడు అన్నం పెట్టి కడుపునింపాలనే ప్రభుత్వ లక్ష్యం కొన్ని కారణాల వల్ల నీరుగారుతోంది. పైరవీలు, పలుకుబడి ఉపయోగించే చాలా మంది అనర్హులు రేషన్ కార్డులు పొందిన విషయాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా గుర్తించాయి. అయితే జిల్లా మొత్తంగా ఉన్న 257252 రేషన్ కార్డుల్లో 7213 రేషన్ కార్డులు పొందిన వారు అనర్హులుగా గుర్తించారు. కార్లు, భూములు, భవంతులు, ఐటి చెల్లింపు దారులకు కూడా రేషన్‌కార్డులు ఉండటం గమనార్హం. అక్రమ రేషన్ కార్డుల నుండి సననబియ్యం తీసుకుంటున్న వారితో పాటు చాలా మంది ఆ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేటతెల్లమైంది. రేషన్ కార్డుల జారీకి నిరంతర ప్రక్రియ ఏర్పాటు చేయడంతో గత ఏడాది నుండి ఇప్పటి వరకు చాలా మంది రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. వారిలో చాలా మంది అనర్హులు ఉన్నప్పటికీ ఇబ్బడి ముబ్బడిగా కార్డులు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని పలువురు సంపన్నలు, భూములన్న వారు, ఐటి చెల్లించే వారు, పరిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, బహుళ అంతస్తులు గల వారికి కూడా రేషన్ కార్డులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రజల ఆదాయ వ్యయాలు, సౌకర్యాల విషయంపై కూడా దృష్టి సారించింది. ఖరీదైన కార్లు, బంగారాన్ని అధిక మొత్తంలో కొనుగోలు చేసిన వారు కూడా రేషన్ కార్డులు పొందినట్లు గురితంచే ప్రక్రియ చేపట్టారు. వారి వ్యవహారాన్ని గుర్తించి కార్డులను రద్దు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇల్లు, పిల్లల చదువుల కోసం రుణాలు పొందేందుకు చాలా మంది ఆదాయానికి మంచి లెక్కలు చూపించి ఐటి చెల్లిస్తుంటారు. వార్షిక ఆదాయం 8 లక్షలు ఉన్న వాళ్ల కార్డులను కూడా ఏరివేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇప్పుడు వారంతా ఆందోళన చెందుతున్నారు. కొందరు ఎక్కువ ధర పలికే లగ్జరీ కార్లను సెకండ్ హ్యాండ్‌లో తక్కువధరకే కొంటున్నారు. ఇప్పుడు అది విలాసవంతమైన విధానంగా చూపుతున్న నేపథ్యంలో రేషన్ కార్డు రద్దవుతుందని చాలా మంది ఆందోళన చెందుతున్నారు.

### కొనసాగుతున్న విచారణ....

జిల్లాలో అనర్హులకు రైషన్ కార్డులు ఉన్నాయంటూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ ముమ్మరం చేశారు. ఇప్పటికే జిలాల్లో 7213 అక్రమ రేషన్ కార్డులను గుర్తించిన అధికారులు వాటిపై ఇంటింటి విచారణ చేపడుతున్నారు. దీనిపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత వ్యక్తమవుతోంది. విచారణ జరుగుతున్న సమయంలో రాజకీయ పైరవీలు చేస్తున్నప్పటికీ సిబ్బంది వాటిని పెడచెవిన పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా చాలా రేషన్ కార్డుల్లో మృతి చెందిన వారి పేర్లు కూడా ఉన్నట్లు, వారి పేర్లమీద కూడా చాలా కాలంగా రేషన్ బియ్యం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వ్యక్తి మృతి చెందిన వెంటనే ఆయా సంబంధిత ప్రభుత్వ కార్యాయాల్లో జనన, మరణ ధృవీకరణ చేయాల్సి ఉండగా, వాటిపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అక్రమ రేషన్ కార్డులను తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పలు కుటుంబాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. బిఆర్ఎస్ నాయకులు ఖయ్యూం మాతృమూర్తి రబియాబేగం మంగళవారం మృతిచెందారు. ఆమె మృతికి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ పాలడుగు పాపారావు తండ్రి సత్యం ఇటీవల మృతిచెందారు. ఆయన మృతికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మిర్చి శాఖ సెక్రటరీ యడ్లపల్లి సతీష్ సతీమణి స్వాతి సోమవారం మృతిచెందారు. ఆమె మృతిపట్ల పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సొసైటీ మాజీ అధ్యక్షులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు నాగండ్ల కోటేశ్వరరావు, మగ్బూల్, నాయకులు బత్తుల మురళీ, జశ్వంత్, మెంతుల శ్రీశైలం, దేవభక్తిని కిషోర్, మందడపు రామకృష్ణ, శరత్, షకీనా తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల కేంద్రం బోనకల్‌లో చైతన్య గ్రామసమైఖ్య సంఘాల ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సహకారంతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆత్మకమిటీ ఛైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, తహశీల్దార్ రమాదేవి, సర్పంచ్ బానోతు జ్యోతి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర ప్రాంత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, రావినూతల గ్రామ సర్పంచ్ బద్రునాయక్, ఎపిఎం కె.వెంకటేశ్వర్లు, గోడ నరసయ్య, వెంకటరావమ్మ, ఎఇఓ రజిత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత సైకిళ్లు పంపిణీ

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుండి ఇంటర్మీడియేట్ చదువుతున్న విద్యార్థినిలకు గురువారం ఉచిత సైకిళ్లు పంపిణీ చేయటం జరుగుతుందని ఎంఇఓ దామాల పుల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థినిలకు పాఠశాలలకు వచ్చేందుకు వారికి ఎంతో ఉపయో గపడే సైకిళ్లను డిప్యూటీ సిఎం మల్లుభట్టివిక్రమార్క సహకారంతో వారి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పించడం హర్షింపచదగ్గవిషయమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# తలసేమియా రహిత తెలంగాణే లక్ష్యం




**- సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తలసేమియా రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు పిలుపునిచ్చారు. తలసేమియా రహిత తెలంగాణను నిర్మించడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. మే ఎనిమిది ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఖమ్మంలోని రితన్య హాస్పటల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని సిఎస్‌బి ఎసిపి టి. మహేష్, ఏఆర్ ఎసిపి నర్సయ్య, సిసిఎస్ ఎసిపి సర్వర్, సిఎస్‌బి సిఐ రాజిరెడ్డి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎస్‌బి ఎసిపి మహేష్ మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల కోసం రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. సమాజంలో తోటి వారికి సేవ చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరిలో రావాలని కోరారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులకు అవసరమైన సమయాల్లో తాము రక్తదానం చేస్తామని తెలిపారు. ప్రముఖ వైద్యులు డి. నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి రవిచంద్ర మాట్లాడుతూ ప్రతి యేటా ఏప్రిల్ ఎనిమిది నుండి మే ఎనిమిది వరకు తలసేమియా వ్యాధి నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా నెల రోజుల పాటు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలతో పాటు చిన్నారులకు అవసరమైన వైద్య పరీక్షలు,రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వేసవి కాలంలో తలసేమియా చిన్నారులకు రక్తం దొరకడం కష్టతరమవుతుందని ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ముందస్తుగా ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ ఏడాది తలసేమియా రహిత తెలంగాణ నిర్మాణం అనే నినాదంతో గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. సిఎస్‌బి ఏసిపి మహేష్, సిఎస్‌బి సిఐ రాజిరెడ్డి లు తలసేమియా చిన్నారుల వైద్య సాయం కోసం ఒక్కొక్కరు రూ. 10వేల ఆర్థిక సాయం సంస్థకు అందించారు.

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈవిఎం గోడౌన్ వద్ద పటిష్ఠ నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నెలవారి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ సీళ్లను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి అవి పని చేస్తున్నవి లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మోగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రాతా లోపాలు లేకుండా చూడాలన్నారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిఐలు, ఎస్సైలు వాహనాలను తనిఖీ చేశారు. ప్రధానంగా నెంబర్ ప్లేట్ లేనివాహనాలను నిలిపి భారీగా జరిమానాలు విధించారు. ద్విచక్రహనాలపై నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతూ కొందరు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున ఘటనలు పెరుగుతుండటంతో వాటిని నియంత్రించేందుకు స్పేషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలతోపాటు రాంగ్‌రూట్ , హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న ద్విచక్రవాహనాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. నెంబర్ ప్లేట్ తెచుకుని అమర్చుకునేందుకు వెసులుబాటు ఇచ్చి అనంతరం వదిలిపెట్టారు. ఈ క్రమంలో నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు భారీగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలను వారికి వివరించారు. మైనర్లు డ్రైవింగ్ చేయరాదని తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వాహనదారులు తమవెంట డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని రకాల ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదా నివారణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పెండింగ్ చలానాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు.

# స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకోండి : సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా శారీరదారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని పోలీస్‌కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సిటీ ఆర్మీరిజర్వుడ్ హెడ్ క్వాటర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింట్ కోర్టును సిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసు కుటుంబాలు, సిబ్బంది శిక్షణ కోసం ఆధునిక సౌకర్యాలతో దీనిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిని వినియోగించుకుని పోలీసుల పిల్లలు క్రీడల్లో రాణించాలన్నారు. పోలీసు సిబ్బంది , కుటుంబాల ఆరోగ్యం కోసం ఇటువంటి సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రశంస పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డిసిపి కుమారస్వామి, విజయబాబు, ఏఆర్ ఏసిపిలు సుసిల్‌సింగ్, నర్సయ్య, ఎస్‌బి ఏసిపి మహేష్, సిసిఎప్ ఏసిపి సర్వర్, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్ కామరాజు, శ్రీశైలం, సాంబశివరావు, సురేష్, నాగుల్‌మీరా, ఇన్స్‌స్పెక్టర్లు రాజిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రిహానా కమల్ పాషా. జయశంకర్ బడిబా కార్యక్రమాన్ని పిఎంఎస్ హెచ్‌ఆర్‌ఐ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సత్తుపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంపుతో పాటు పాఠశాలల అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రెహనా కమల్ పాషా బేగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎన్. రాజేశ్వరరావు మాట్లాడుతూ బడి బాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల నమోదు పెంపు, డ్రాప్ ఔట్‌ల నివారణ, నాణ్యమైన విద్య అందించడమని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఆర్. శైలకుమారి మాట్లాడుతూ ఈ పాఠశాలలో అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందించి విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమల్ పాషా, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ఉమా, రాణి కుమారి, సరిత మాజిద్, వెంకటలక్ష్మి , అంగన్వాడీ టీచర్లు కృష్ణ కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ మధిర :** గ్రామాల్లో మట్టి రోడ్డుగా ఉన్న అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా మార్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని నిధానపురం గ్రామంలో గురువారం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డుకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు ఎంపి కోటా నుండి సిసి రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మధిర నియోజకవర్గంను అభివృద్ధి పథంలో ఉరుకులు పెట్టిస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ అమరవాది సత్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ రత్నకుమారి, కటికల సీతారామిరెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, చావలి రామరాజు, ఐలూరి జనార్ధనరెడ్డి, కపిలవాయి సత్యనారాయణరాజు, వెంపాటి ప్రభాకర్, రమేష్, ఇర్మియా, అక్కినపల్లి నాగేశ్వరరావు సోమ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శమూర్తి కోట నాగభూషణం

**-అనారోగ్యంతో మృతి**
**-పలువురి నివాళి**





**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, మాజీ గ్రామసర్పంచ్ కోట నాగభూషణం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. మధిరలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తదితరులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోట నాగభూషణం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన కాలంలోనే ఆయన అనేక మంది విద్యార్థుల జీవితాలను మార్గదర్శనం చేశారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తూ మంచి గురువుగా గుర్తింపు పొందారు ఆయన మరణ వార్త తెలియగానే గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని చివరి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు, చూపిన మార్గంరాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. రాయపట్నం గ్రామంలోని తన స్వగృహంలోని ఆయన భౌతికకాయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, గ్రామ ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# విద్యుత్ కార్మికుల సమ్మె



**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్, అన్మాండ్ పీస్ రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్స్ జేఏసి పిలుపు మేరకు మధిర విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయం సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెకు విద్యుత్ శాఖలోని ప్రధాన ట్రేడ్ యూనియన్స్ 327 యూనియన్, 1104 యూనియన్, టిఆర్వికేఎస్ యూనియన్ మధిర డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పూర్తిస్థాయిలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# ఉపాధి హామీ పనులు కల్పించాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని రామానగరం గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యు లు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం రామానగరంలో జరిగిన గ్రామసభ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మహాలక్ష్మి కి సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ రామానగరం గ్రామంలో కూలీపై ఆధారపడి జీవించే కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నాయని వారందరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రోజు కూలి రూ.600 ఇవ్వటంతో పాటు 200 రోజులు పనులు కల్పించాలని, రెండు సార్లు ఫోటో తీసే విధానం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సకాలంలో పనులు కల్పించుకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి దండు జగన్, లక్ష్మీకాంత, పిల్లి నాగమణి, మరియమ్మ , పట్టకోయి సీత, రాధా, రాములమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు మరమ్మతులు ప్రారంభించిన సర్పంచ్



ప్రజాపక్షం/ములకలపల్లి: మాదారం ఎర్ర చెరువు గండి మరమ్మతులను బుధవారం సర్పంచ్ గంపా సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరంలో అతి పెద్ద వర్షాలకు ఎర్ర చెరువు ఎడమ వైపు ఆనకట్టకు గండి పడి చెరువులో నీళ్ళు నిలువ లేక రైతులు పంటలు నష్టపోయారని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి సౌకర్యంగా ఉండేందుకు ఆనకట్టకు 5లక్షల వ్యాయామంతో ఆనకట్ట పనులను ప్రారంభించారు. వచ్చే వర్షకాలం సీజన్ కల్లా రైతులకు సాగునీరు అందించే విధంగా ఎర్ర చెరువు ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో ముదిగొండ వెంకన్న, చనగాని వినోద్, గంపా సత్యం, కోయ్యాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు ఆర్థికంగా ఎదిగేలా సొసైటీ కృషి చేయాలి

-సిఈ బిచ్చన్న



ప్రజాపక్షం/పినపాక: కేటిపిఎస్, బిటిపిఎస్, వైటిపిఎస్ సొసైటీ, టిజి జెన్‌కో సంస్థలో ఉద్యోగులు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయాలని, సొసైటీ తోడ్పాటు అందించాలని బిటిపిఎస్ సిఈ బిచ్చన్న కోరారు. బిటిపిఎస్‌లో పని చేస్తున్న, భూనిర్వాసిత ఉద్యోగులకు, లోను మొత్తం పెంచే విషయమై సొసైటీ కమిటీ, అభ్యర్థన మేరకు సిఈ సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పెంచాలని బిచ్చన్న సూచించారు. అనంతరం సొసైటీ కమిటీ చీఫ్ ఇంజనీరింగ్ బిచ్చన్నని సత్కరించారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కేసులాల్, వైస్ ప్రెసిడెంట్ వల్లమల్ల ప్రకాష్‌రావు, కార్యదర్శి సిద్ధి ప్రశాంత్, కోశాధికారి వీరమల్లు రఘుకృష్ణరావు, డైరెక్టర్లు సిద్దెల హుస్సేన్, డోలి శ్రీనివాసరావు, సొసైటీ సీఈఓ మాసిరెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- దిశ సమావేశంలో ఎంపిలు ఆర్‌ఆర్‌ఆర్, పోరిక



ప్రజాపక్షం/ కొత్తగూడెం : అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి అని ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్ అన్నారు. ఐడిఓసిలో బుధవారం దిశ సర్వసభ్య సమావేశం ఖమ్మం ఎంపి ఆర్‌ఆర్ఆర్ అధ్యక్షతన, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరామ్ నాయక్ సహాధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మారుమూల ప్రాంతాల వరకు తాగునీరు సరఫరా, ఆస్పత్రుల్లో మౌలిక వసతుల మెరుగు, రహదారులు, విద్యుత్, గృహ నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రభుత్వ పథకాలు అర్హులకు సకాలంలో చేరే విధంగా చూడాలని సూచించారు. అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ, ఇల్లెందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, పినపాక, భద్రాచలం ఎంఎల్‌ఏలు పాయం వెంకటేశ్వర్లు, డా.తెల్లం వెంకట్రావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, అటవీశాఖాధికారి కృష్ణగౌడ్, దిశ కమిటి సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు దారులకు అవగాహన కల్పించాలి

- ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్



ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ ద్వారా గిరిజన మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్‌కు వచ్చే కొనుగోలు దారులకు అర్థానికి ఉత్పత్తులపై పూర్తి అవగాహన కల్పించాలని ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిజ్ రాజ్ అన్నారు. ఆయన బుధవారం యూనిట్ అధికారులతో కలిసి మార్ట్‌ను సందర్శించారు. స్టాక్,సిబ్బంది పనితీరు, అమ్మకాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తులు కొనుగోలు చేసే వినియోగదారులకు అర్థానికి ఉత్పత్తులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. నాణ్యమైన, శుద్ధమైన సరుకులు విక్రయించడం బాధ్యతని, వినియోదారులు నమ్మకంగా కొనుగోలు చేసేందుకు వస్తుంటారని, వారి నమ్మకాన్ని ఒమ్ముచేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉదయ్, వేణుగ, హరికృష్ణ, జయరాజు, ఆదినారాయణ, భార్గవి, శ్రీనివాస్, సాయి చంద్, కార్తీక్, ఝాన్సీ,నవ్య, భవ్య, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం - కొత్తగూడెం గ్యాస్ పైపులైన్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఖమ్మం నుండి భద్రాద్రి కొత్తగూడెం వరకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. అనుమతులు, భూ సేకరణ, రోడ్ల తవ్వకాలు వంటి పనులు శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ కొరత నివారణకు పిఎన్‌జి సరఫరాను త్వరగా అందుబాటులోనికి తీసుకురావాలని తెలిపారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకతుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# కొనుగోలు కష్టాలు...

- భారంగా మారిన తరలింపు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- రోడ్లపై కుప్పలుగా ధాన్యపు రాశులు
- సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని రైతుల పరిస్థితి రోజురోజుకు వర్ణనాతీతంగా మారుతోంది. ఆరుగాలం కష్ట పడి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చినప్పటికీ, దానిని అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్దులపల్లి మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, రైతులకు అది అక్కరకు రాని పరిస్థితి నెలకొన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. కొనుగోలు సిబ్బంది వివిధ కారణాలు చూపిస్తూ మొక్కజొన్నను తిరస్కరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత పేరుతో కొర్రీలు పెడుతుండటంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

### సాగైన మొక్కజొన్న...

ఈ సీజనల్ సుమారు 10, 300ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయ్యింది. మూడు లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు అంచనా. ఇందులో ఇప్పటివరకు సుమారు 10శాతం,1500క్వింటాళ్ల వరకు కోత పూర్తయ్యింది. ఈ పంటను ప్రధానంగా తల్లంపాడు, కొండాపురం, తెల్దారుపల్లి, గుదిమళ్ల, ఆరెకోడు, ముత్తగూడెం గ్రామాల్లో అధికంగా సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కోతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాలలోని రోడ్లపై, పొలాల్లో పెద్ద ఎత్తున ధాన్యపు రాశులు ఎండపెట్టుకున్నారు. ఇవి ఎటువంటి రక్షణ లేకుండా ఉండటంతో రైతులు ఆందోన చెందుతున్నారు.

### భారంగా మారిన తరలింపు..

ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నప్పటికీ, పంటను కొనుగోలు కేంద్రానికి తరలించి అమ్ముకోవడం రైతులకు భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఒక్కచోట మాత్రమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో తమ గ్రామాల నుంచి పంటను తీసుకువెళ్లి అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రెండు నుంచి మూడు రోజుల పాటు అక్కడే పడిగాపులు కాయాల్సివస్తోందని వాపోతున్నారు. ప్రతి క్వింటాకు సుమారు రూ.100వరకు రవాణా ఖర్చు అవుతుండటంతో అదనపు భారం పడుతోందంటున్నారు. వాహనాల ద్వారా సెంటర్‌కు తరలించేందుకు భారీగా డబ్బులవుతుండటంతో చాలా మంది రైతులు తమ పంటను తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. ఇలా తమ పండించిన పంట మొత్తాన్ని సెంటర్‌కు తరలించాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చువుతాయంటున్నారు. రవాణా ఖర్చులు పెరగడంతో పంట అమ్మకం ద్వారా వచ్చే లాభం తగ్గిపోతుందని కలవరానికి గురవుతున్నారు.

### దళారులను ఆశ్రయిస్తున్న రైతులు...

కొనుగోలు కేంద్రంలో పెడుతున్న కొర్రీలు, సెంటర్ వరకు పంటను తరలించలేని భారంతో రైతులు చివరికి దళారులను ఆశ్రయిస్తున్నారు. సెంటర్ నిర్వాహకులు తూర్పార్పాలంటు తెచ్చిన ధాన్యాన్ని తిరస్కరిస్తున్నారని, క్వింటాకు కేజీ తరుగు కట్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద తూర్పార్పలంటే రూ.100 వరకు అదనంగా హామాలీలకు ఇవ్వాల్సి వస్తుందని వాపోతున్నారు. మరోవైపు పంట కాటా ఆలస్యం జరుగుతుండటం, అమ్మిన సరుకుకు తరువత డబ్బులు చేతికి అందేందుకు ఎక్కువ సమయంతో పడుతుండటంతో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులు కారణంగా కొంతమంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు తక్కువ ధరకు పంట విక్రయించాల్సి వస్తోందని, క్వింటాకు సుమారు రూ.1800కే దళారులకు అమ్ముకుంటున్నట్లు తెలిసింది. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తరలింపు భారంగా మారింది



రూ.6లక్షలు వెచ్చించి, 15ఎకరాల వరకు సాగు చేశాను. సెంటర్‌కు వెళ్లి అమ్ముకోవలంటే అదనపు భారం అవుతోంది. వాహనాల ద్వారా తరలింపుకు క్వింటాకు రూ. 100అడుగుతున్నారు.

రైతు, నరేందర్

### కొనుగోలు కొర్రీలు



కొనుగోలు కేంద్రంలో అనేక కొర్రీలు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. అల్లంత దూరం నుంచి తీసుకువస్తే తూర్పార్పడంతో పాటు పలు కారణాలు చెబుతున్నారు. దీనికి గాను అక్కడ అదనపుభారం పడుతోంది

రైతు, మధు

### వెంటనే కాంటా



కొనుగోలు కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు లేవు. రైతులు ఆరబెట్టుకొని తూర్పార్చుకుని, తీసుకుని వస్తే వెంటనే కాంటా పెట్టి సరుకును పంపిస్తాము. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ మద్దుతు ధరను సద్వినియోగం చేసుకోండి

సొసైటీ సీఈఓ,మెహమూద్‌అలీ

## సంత ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాయంకు వినతి



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ని బుధవారం సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో గల డిగ్రీ కాలేజ్ రోడ్ లో ఏర్పాటు చేయబోవు సంత (అంగడి) గురించి వివరించి ఈ సంత కి సింగరేణి యాజమాన్యం ద్వారా మట్టి, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరుతు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంత ఏర్పాటు ను అభినందించడంతో పాటు సమితి సింగారం గ్రామపంచాయతీ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ గణేష్ రెడ్డి, పాతూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌పి టీకా ప్రారంభం

ప్రజాపక్షం/కూసుమంచి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి టీకా కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రోజే 22 మంది బాలికలకు టీకాలు ఇవ్వగా ఎలాంటి దుష్ప్రభావాలు నమోదు కాలేదు. 14 నుండి 15 సంవత్సరాల లోపు బాలికలు అర్హులు, ప్రతి పనిదినం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1గంటల వరకు టీకా అందుబాటులో ఉంటుంది. ఆధార్ కార్డు, లింక్ చేసిన మొబైల్ నంబర్ తీసుకురావాలి. గతంలో నెలకొండపల్లి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇప్పుడు కూసుమంచిలోనే సౌకర్యం కల్పించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారి సూచించారు.

## ఉరి వేసుకొని బాలుడు మృతి

ప్రజాపక్షం/పాల్వంచ : ఉరి వేసుకొని ఓ బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం పాల్వంచ వెంగళరావు కాలనీకి చెందిన భూక్యా కిషన్ కుమారుడు మహేందర్ నాయక్ (12) స్థానిక డిఏవి పాఠశాలలో ఆరవ తరగతి చదువుకొంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవర్మరణం చెందాడు. దీనితో ఆ కుటుంబంలో విశాధఛాయలు అలముకొన్నాయి. మృతికి కారణాలు తెలియాల్సి వుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ టి. నాగరాజు కేసు నమోదు చేశారు.

# రోడ్డు విస్తరణలో పల్లె ప్రకృతి వనం మాయం

- పిఆర్ అధికారుల నిర్వాకంపై మల్లాయిగూడెం ప్రజల ఆగ్రహం
- మొక్కల లెక్కలపై గుత్తేదారు...కార్యదర్శి మధ్య విభేదాలు





ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని మల్లాయిగూడెం గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల పేరుతో పల్లె ప్రకృతి వనం పూర్తిగా తొలగించబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో పెరిగిన సుమారు 1000 చెట్లను తొలగించి, అదే ప్రదేశంలో గుత్తేదారు వందలాది ట్రక్కుల మట్టిని తోమినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో పంచాయితీ రాజ్ అధికారుల నిర్లక్ష్యం, పంచాయితీ కార్యదర్శి ఉదాసీనతపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లె ప్రకృతి వనం కోసం గతంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. వాటిలో చాలా మొక్కలు నాలుగు సంవత్సరాల కాలంలో చెట్లుగా ఎదిగాయి. అయితే ఇటీవల చేపట్టిన రోడ్డు విస్తరణ పనులలో భాగంగా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా ముందస్తు సమాచారం లేకుండానే ఆ మొక్కలను(చెట్లు)తొలగించినట్లలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే తొలగించిన ప్రదేశాన్ని తిరిగి పచ్చదనంగా మార్చాల్సిన చోట, గుత్తేదారు మట్టి తోమి నాడని గ్రామస్తులు చెబుతున్నారు. పల్లె ప్రకృతి వనం స్థలాన్ని అసలు ఉద్దేశానికి విరుద్ధంగా ఉపయోగించడం పట్ల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



### మొక్కల లెక్కలపై గందరగోళం....

పల్లె ప్రకృతి వనంలో ఉన్న మొక్కల సంఖ్యపై గుత్తేదారు మరియు పంచాయితీ కార్యదర్శి మధ్య విభేదాలు నెలకొన్నట్లు సమాచారం. నాలుగు సంవత్సరాల వయసు గల మొక్కలకు తాను పదుల సంఖ్యలో మాత్రమే పరిహారం చెల్లిస్తానని గుత్తేదారు చెబుతుండగా, వాస్తవానికి అక్కడ వేల సంఖ్యలో మొక్కలు ఉన్నాయని, వాటి అన్నింటికీ పరిహారం ఇవ్వాల్సిందేనని పంచాయితీ కార్యదర్శి వాదిస్తున్నట్లు తెలిసింది. అయితే మొక్కల అసలు సంఖ్యపై స్పష్టమైన లెక్కలు లేకపోవడం, పంచాయితీ రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల పరిస్థితి మరింత వివాదాస్పదంగా మారింది. మొక్కలు తొలగించే ముందు పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం, వాటి విలువను అంచనా వేయకపోవడం కూడా ప్రశ్నార్థకంగా మారింది.

### జిల్లా అధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు.....

ఈ వ్యవహారంలో స్థానిక స్థాయిలో న్యాయం జరగదనే అనుమానంతో గ్రామస్తులు జిల్లా స్థాయి అధికారుల జోక్యాన్ని కోరుతున్నారు. తొలగించిన మొక్కలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, ఎంత సంఖ్యలో మొక్కలు నాశనం అయ్యాయో గుర్తించాలని, వాటి విలువను అంచనా వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పల్లె ప్రకృతి వనం కోసం ప్రత్యేకంగా మరో స్థలాన్ని గుర్తించి, తొలగించిన ప్రతి మొక్కకు బదులుగా కొత్త మొక్కలు నాటాలని గ్రామస్తులు కోరుతున్నారు. పిఆర్ అధికారులు, గుత్తేదారు, పంచాయితీ కార్యదర్శి పాత్రపై జిల్లా కలెక్టర్, డిపిఓ, పంచాయితీరాజ్ ఉన్నతాధికారులు విచారణ జరపాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### పంచాయితీ కార్యదర్శి నాగమణి వివరణ....


మల్లాయిగూడెం గ్రామంలో పంచాయితీ పరిధిలో పల్లె ప్రకృతి వనం మాయంపై ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా జరిగిందంతా నిజమేనని అందుకోసం పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ రోడ్డు పనులు చేస్తున్న గుత్తేదారుకు నోటీసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

### పిఆర్ డిఈ వంశీ వివరణ....

మల్లాయిగూడెం రోడ్డు విస్తరణలో ఇప్పటికీ పది సార్లు రోడ్డు వద్దకు వచ్చాను ఇంకా నాతో పాటు పిఆర్ ఈఈ, పిఆర్ ఎస్‌సిలు కూడా వచ్చారని, ఎక్కడ పల్లె ప్రకృతి వనం లేదని, ఇప్పుడు మీరు చెప్తుంటేనే తెలుస్తుందని అన్నారు.(ప్రజాపక్షం విలేఖరి)మరోసారి తిరిగి మాట్లాడుతూ జరిగిన ఘటన నిజమే కానీ మా గుత్తేదారు కేవలం ఐదో, పదో మొక్కలు మాత్రమే తొలగించారు అయినా కార్యదర్శితో మాట్లాడుతూనే ఉన్నారని అన్నారు. ఇది ఇలా ఉండగా సోమ, మంగళ వారాల్లో కూసుమంచి మండల పిఆర్ ఏఈ అఖిల్‌ను ఫోన్ ద్వారా సంప్రదించటకు ప్రయత్నం చేయగా, ఎటువంటి సమాధానం ఇవ్వలేదు.

## 10న ఆదివాసీ సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళనం

- కోయ ఇలవేల్పుల చరిత్ర పుస్తకావిష్కరణ
- హాజరుకానున్న మంత్రి సీతక్క





ప్రజాపక్షం/భద్రాచలం : ఈనెల 10వ తేదిన ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో ఆదివాసీ సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు.ఈ వేడుకకు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) ముఖ్యాతిధిగా హాజరవుతున్నట్లు తెలిపారు. మంత్రితోపాటు ఎంఎల్‌ఏలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా ఉన్నతాధికారులు, ఆదివాసీ సంఘాల ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ పెద్దలు తదితరులు హాజరవుతున్నారు. ఈ వేడుకలో కోయ ఇలవేల్పుల చరిత్ర పుస్తకావిష్కరణ చేస్తారు.

## ట్రాఫిక్ సిబ్బంది వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వేసవి కాలంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. బుధవారం ఎస్‌పి కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్లు పంపిణీ చేశారు. వీటిలో ఒక రౌండ్ టోపీ, కళ్లజోడు, వాటర్ బాటిల్, 30 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 60 మాస్కులు ఉన్నాయి. సిబ్బంది విధుల నిర్వర్తించడంతోపాటు తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలన్నారు. శరీరానికి సరిపడా నీటిని తీసుకోవాలని, వేడిని నుండి ఎప్పటికప్పుడు స్వీయ సంరక్షణతీసుకోవాలని, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్‌పి ఆదినారాయణ, ఎస్‌బి సిఐ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐఎఫ్‌బి జిల్లా కన్వీనర్‌గా బుడగం



ప్రజాపక్షం/పాల్వంచ : స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా పాల్వంచ పట్టణానికి చెందిన బుడగం నాగేశ్వరరావును నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి భోజిరెడ్డి నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు పార్టీ జిల్లా కన్వీనర్‌గా అవకాశం కల్పించిన జాతీయప్రధాన కార్యదర్శి ఆర్‌వి. ప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ భోజిరెడ్డి, నాయకులు కొండ దయానంద్, క్రిష్ణమూర్తి, బుచ్చిరెడ్డి, దిలీప్‌లకు దన్యవాదములు తెలిపారు.

# కొమ్ముగూడెం ఉన్నత పాఠశాలలో మెనూ మాయం..



- -మధ్యాహ్న భోజనం విద్యార్థుల కడుపు నిండని వైనం..
- -కాగితాలకే పరిమితమవుతున్న మెనూ..
- -పాఠశాల అధ్యాపకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచ్, ఉపసర్పంచ్..

ప్రజాపక్షం/జూలూరుపాడు: ప్రభుత్వం నిరుపేద విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనంలో మెనూను తుంగలో తొక్కుతున్నారు. విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాల్సిన కొంతమంది నిర్వాహకులు, తమ జేబులు నింపుకోవడమే లక్ష్యంగా నాణ్యత లేని భోజనాన్ని వడ్డిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### పేరుకే మెనూ.. వడ్డించేది మాత్రం దారుణం....

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థినులకు ప్రతిరోజూ గుడ్డు, పాలు, ఆకుకూరలు మరియు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. వారానికి ఒక్క రోజు కూడా సక్రమంగా మెనూ పాటించడం లేదని, విద్యార్థులు తెలుపు తున్నారు. నాణ్యత లేని బియ్యం, నీళ్ల చారుతో కడుపు నింపుకోలేక చాలామంది విద్యార్థులు అర్ధాకలితోనే వెళ్ళదీస్తున్నట్టు నెలకొంది.

### తనిఖీలు లేవు.. నిలదీసే వారు లేరు...

జిల్లా విద్యాశాఖ అధికారులు గానీ, సంబంధిత పర్యవేక్షకులు గానీ మధ్యాహ్న భోజనం వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు వస్తున్నారనే సమాచారం ఉన్నప్పుడు మాత్రమే మెనూ పాటిస్తూ, మిగిలిన రోజుల్లో నాసిరకం భోజనాన్ని పెడుతున్నారు. అధ్యాపకులు, వంట మనుషులు కుమ్మక్కై నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఉన్నంతధికారుల దృష్టికి తీసుకెళ్తా.. సర్పంచ్ జ్యోతి

జూలూరుపాడు మండలపరిధిలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కొమ్ముగూడెం గ్రామపంచాయతీలో సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ నవీన్ నాయక్ లు విద్యార్థుల దగ్గరకు వెళ్లి వాళ్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వయంగా మాకు



భోజన సదుపాయం సరిగా లేదని గుడ్లు మరియు మెనూలో ఉండే విధంగా రోజు మాకు పెట్టడం లేదని విద్యార్థులు తెలియజేశారు. అలాగే కూరగాయలు గుడ్లు రాగి జావ. లాంటివి పెట్టకపోయినా పెట్టినట్లు బిల్లులు తీసుకోవడం జరుగుతా ఉందని విద్యార్థులు తెలపగగా సర్పంచ్ జ్యోత, ఉప సర్పంచ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారు.

### మండల విద్యాశాఖ అధికారి వివరణ...

భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలపరిధిలోని కొమ్ముగూడెం గ్రామం లోని పాఠశాల నందు మధ్యాహ్న భోజనంలో మెనూను తుంగలోకి తొక్కి విద్యార్థులను అర్ధాకలితో పస్థులుంచుతున్నారని తెలిసి పాఠశాలను సందర్శించిన సర్పంచ్, ఉపసర్పంచ్ లు తెలిపిన విషయం ఫై మండల విద్యాశాఖ అధికారి జంకిలాల్ ని ప్రజాపక్షం ప్రతినిధి వివరణ కోరగా, సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియో గత పదిహేను రోజుల క్రితందని, ఇంతకు ముందే ఇట్టి విషయం నా దృష్టికి రాగానే స్వయంగా పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను హెచ్చరించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించానని విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సాహించేది లేదని, కొమ్ము గూడెం పాఠశాల విషయం ఫై సమగ్ర విచారణ చెప్పడతానని తెలిపారు.

# మహాలక్ష్మి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి




**-మహిళా హక్కులను పరిరక్షించాలి**

ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐ డబ్ల్యు అనుబంధం) జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500 వారి వారి ఖాతాల్లో జమ చేయాలని, తులం బంగారాన్ని కళ్యాణానికి అందించాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా సమాఖ్య విస్తృత స్థాయి సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగిన సభలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలలో ఉచిత బస్సు తప్ప దేనిని అమలు చేయలేదని అది కూడా ప్రయాణం ఒక ప్రహసంగా మారిందన్నారు. ప్రయాణికులకు తగిన రీతిలో బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని లతాదేవి తెలిపారు. మహిళా చట్టాల అమలులో బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రోజు రోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన విబి జీ రాం జీ పథకంలో మార్పుల కారణంగా గ్రామీణ ప్రాంత మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విబి జీ రాం జీ పథకంలో రెండు సార్లు ఫోటో పద్ధతిని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పార్లమెంటు స్థానాల పునర్ వ్యవస్థీకరణలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను నిర్ణయించాలని ఇందుకు సంబంధించి బిల్ పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ రూపొందించుకునే క్రమంలో మే ఐదున కొణిజర్లలో మహిళా సమాఖ్య జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు లతాదేవి తెలిపారు. ఈ సమావేశంలో తాటి నిర్మల, మహిళా సమాఖ్య ఇంచార్జి దొండపాటి రమేష్, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, మందడపు రాణి, కె. విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నివారించడమే లక్ష్యం



**-గ్రామ కమిటీలు పటిష్టంగా పనిచేయాలి**
**-టిజిఎస్‌సిపిసిఆర్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి**



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : బాల్య వివాహాలను నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టిజిఎస్‌సిపిసిఆర్) ఛైర్ పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి తెలిపారు. టిజిఎస్‌సిపిసిఆర్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత అధ్యక్షతన నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల విద్యాహక్కు వంటి అంశాలపై చర్చించారు. గ్రామస్థాయిలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు (విసిపిసిఎస్) మరింత చురుగ్గా పని చేసి బాలల సమస్యలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఛైర్ పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం కూడా బాలల హక్కుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి విజేత మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రఘునాథపాలెం మండలాన్ని త్వరలోనే బాల్య వివాహ రహిత మండలంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దీనికి స్పందించిన సర్పంచ్‌లు సంఘీభావం తెలుపుతూ గ్రామస్థాయిలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. డిపివో రాంబాబు మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పటిష్టంగా బాలల రక్షణ కోసం పనిచేసేలా, బాలల హక్కులు తెలియజేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు మాట్లాడుతూ పోలియో రహిత జిల్లాగా ఖమ్మం ఉందని ఆరోగ్యమైన బాలలను తయారు చేయడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తుందన్నారు. బాలల హక్కుల కమిటీ మెంబర్లు చందన, సరిత మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని దాని కోసం ప్రతి సర్పంచ్ కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో బడికి వెళ్లే పిల్లలు ఎంత మంది, వెళ్లని పిల్లలు ఎంత మంది, స్కూల్ మానేసిన పిల్లలు ఎంత మంది వంటి వివరాలు తెలుసుకుని దానికి అనుగుణంగా బాలల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో విసిపిసిఎస్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఛైర్‌పర్సన్ సంతృప్తి వ్యక్తం చేసి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అశోక్‌కుమార్, జిసిడివో విష్ణువందన, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



**-పంటల మార్పిడి విధానం అవలంభించాలి**
**-ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు**

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : రైతులు పంటల మార్పిడి విధానాన్ని అవలంభించి ఆయిల్ పామ్ సాగు చేయాలని ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బూడిదంపాడు రైతు వేదిక నందు మంచుకొండ, బూడిదంపాడు రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రఘునాథపాలెం మండలంలో సాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకం, బుగ్గవాగు ప్రాజెక్టు ద్వారా అన్ని చెరువులకు సాగునీటిని అందిస్తున్నారని తద్వారా ఆయకట్టు కూడా పెరుగుతుందన్నారు. చింతగుర్తి, మంచుకొండ గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చునని ఆదాయం కూడా బాగుంటుందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలను అందిస్తుందని తెలిపారు. మంచుకొండ, బూడిదంపాడు గ్రామాల్లో పలువురు రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారని వారిని ప్రత్యేకంగా అభినందించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ ధర ప్రస్తుతం రూ. 23వేలు ఉందన్నారు. సాగునీటి వసతి ఉన్న రైతులంతా ఆయిల్ పామ్ సాగు చేయాలని తెలిపారు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందని తెలిపారు. వైరా కెవికె శాస్త్రవేత్తలు డా।। కె పావని, చైతన్య లు మాట్లాడుతూ వివిధ పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఉద్యానవన అధికారి నగేష్ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు అందించే వివిధ రకాల సబ్సిడీల గురించి వివరించారు. రైతులకు ఉచితంగా కూరగాయల కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ మందడపు సుధాకర్, ఏఎంసి డైరెక్టర్ అంగాదాల నర్సింహారావు, గోద్రెజ్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు రామకృష్ణ, ఏఈవోలు శ్రీకాంత్, శివ, వల్లభనేని వెంకటప్పారావు, తుమ్మల పల్లి మోహన్‌రావు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో పట్టపగలే చోరీ

**- ఘటనస్థలాన్ని పరిశీలించిన ఎస్సై వెంకటేష్**



ప్రజాపక్షం/ తల్లాడ : మండల కేంద్రమైన తల్లాడలో బుధవారం మధ్యాహ్నం పట్టపగలు చోరీ జరిగింది. తల్లాడలోని గొల్లగూడెంకు వెళ్లే దారిలో షేక్.జమాల్ స్వగృహంలో దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు. వివిధ పనుల నిమిత్తం ఇంట్లో తాళం వేసి వెళ్లిన జమాల్ తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లాడ ఎస్సై2 వెంకటేష్ సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని బంగారు వస్తువులతో పాటు రూ.30వేల నగదు దొంగించినట్లు బాధితుడు జమాల్ తెలిపారు. బంగారు వస్తువుల విలువ సుమారు రూ.7లక్షలకుపైగా ఉంటుందని తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కోల్డ్‌స్టోరేజి అగ్ని ప్రమాద బాధిత రైతులకు సత్వరమే న్యాయం చేయాలి



ప్రజాపక్షం/మధిర : సాయిబాలాజీ కోల్డ్‌స్టోరేజి అగ్ని ప్రమాద బాధిత రైతులకు సత్వరమే నష్టపరిహారం అందించాలని పోరాట కమిటీ కన్వీనర్ దివ్వెల వీరయ్య, కో కన్వీనర్ గువ్వల సీతారామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు తహశీల్దార్ రాంబాబును కలిసి ప్రమాద బీమా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాజీ కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుకున్న తెలంగాణ, ఆంధ్ర రైతులకు సంబంధించిన మిర్చి సాయిబాలాజీ కోల్డ్‌స్టోరేజీలో అగ్ని ప్రమాదానికి గురి కావడంతో బాధిత రైతులు సర్వస్వాన్ని కోల్పోయారని, ప్రమాద బీమా వర్తించటం కోసం రైతులు తమ వద్ద ఉన్న బాండు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకాల జిరాక్స్‌లను తహశీల్దార్ కార్యాలయంలో త్వరగా అందించాలని, అలా అందించిన రైతులను గుర్తించి ప్రమాద బీమా కంపెనీకి పంపించడం జరుగుతుందని, రైతులందరూ త్వరగా తహశీల్దార్ కార్యాలయంలో వీటిని అందించి అధికారులకు సహకరించాలని కోరారు. అధికారులు త్వరితగతిన రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# ఇంటి నెంబర్ అందజేత



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో 11వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లను కనపర్తి సంగీత నిర్మించుకున్నారు. ఆ ఇంటికి వైరా మున్సిపాలిటీ ఇంటి నెంబర్ కేటాయించడం జరిగింది. ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్న వెంటనే నూతన ఇంటి నెంబర్‌ను మున్సిపాలిటీ నుండి కేటాయించారు. ఆ ఇంటి నెంబర్ డాక్యుమెంట్స్‌ను బుధవారం వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ లబ్ధిదారు కనపర్తి సంగీతకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని, పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం జరిగింది. మున్సిపాలిటీలో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లకు తొలి ఇంటి నెంబర్‌ను ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గురులింగం, ఆర్ఐ ప్రదీప్, 14వవార్డు కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, వార్డు ఫీసర్‌లాల్‌మియా పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమణలు తొలగింపునకు మార్కింగ్

**-సర్వే చేసిన ఆర్అండ్‌బి ఏఈ వసుంధర**



ప్రజాపక్షం/వైరా: వైరా జగ్గయ్యపేట రహదారి మరమ్మత్తు పనులు గత కొంతకాలంగా నత్తనడకన కొనసాగుతూనే ఉన్నాయి. ఖమ్మం దేవరకొండ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభం కావడంతో ప్రస్తుతం వైరా నుండి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేకి వాహనాలు వెళ్లే మార్గం ఎక్కడి నుండే ప్రారంభం కావడంతో వాహనాల రద్దీ భారీగా పెరిగింది. ఈ క్రమంలో ఆర్అండ్‌బి అధికారులు వైరా రింగు రోడ్డు నుండి గ్రీన్‌ఫీల్డ్ హైవే వరకు రోడ్డు ప్రక్కన గల ఆక్రమణలు తొలగించేందుకు ఆర్అండ్‌బి ఏఈ వసుంధర బుధవారం సర్వే నిర్వహించి దుకాణాల వద్ద మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఏఈ వసుంధర మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వైరా రింగు రోడ్డు నుండి మధిర రోడ్డు వైపు గల రోడ్డు దుకాణాల ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. దుకాణాలు రోడ్లపై ఉన్న షెడ్లను తొలగించేందుకు మార్కింగ్ ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో మార్కింగ్ చేసిన స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని దుకాణదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ ఏసు, కానిస్టేబుల్‌లు రమేష్, హుస్సేన్, ఆర్అండ్‌బి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ సబ్ సెంటర్‌లకు డస్ట్‌బిన్‌లు పంపిణీ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ బుధవారం ఎస్‌బిఐ ఫౌండేషన్ సహకారంతో వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు, బ్రాహ్మణ పల్లి హెల్త్ సెంటర్స్‌కి డస్ట్‌బిన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఐ హాస్పిటల్ నిర్వాహకులు వుంద్రు శ్యామ్‌బాబు, హాస్పిటల్ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది రామకృష్ణ, మేకల కిషోర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మొగలితోగు విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ పంపిణీ

**- డాక్టర్ సారంగపాణి సేవలు ఆదర్శనీయం**
**- కరకగూడెం ఎంఈఓ గడ్డం మంజుల**



**ప్రజాపక్షం/కరకగూడెం:** జన విజ్ఞాన వేదిక స్టేట్ కల్చరల్ సెక్రటరీ లింగంపల్లి దయానంద్ కరకగూడెం మండలం మొగలితోగు ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సారంగపాణి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరకగూడెం మండల ఎంఈఓ గడ్డం మంజుల హాజరై మాట్లాడుతూ కరకగూడెం మండలం లాంటి ఏజెన్సీ ప్రాంతాలను ఎంచుకొని విద్యార్థులలో ఉన్న ఆత్మ న్యూనతా భావాన్ని తొలగించి, ఆత్మగౌరవాన్ని పెంపొందేలా, చదువు పట్ల ఇష్టాన్ని పెంచేలా, విద్యార్థినీ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ మరియు షూస్ అందజేయడం అభినందనీయం అన్నారు. జన విజ్ఞాన వేదిక స్టేట్ కల్చరల్ సెక్రటరీ డాక్టర్ లింగంపల్లి దయానంద్ మాట్లాడుతూ డాక్టర్ సారంగపాణి తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి ఎదిగారని, సమాజానికి భావిభారత నిర్మాతలైన ఈ విద్యార్థులను తీర్చిదిద్దగలిగితే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని, ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. పద్మాపురం గ్రామ సర్పంచ్ తోలం రమేష్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ పానసారంగపాని సేవలు అభినందనీయమని పాఠశాల అభివృద్ధికి తన వంతు, సహకారాన్ని అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పటాని యాకూబ్ ఖాన్, రేగళ్ల టీచర్ టి.సుజాత, వసంత, రామస్వామి, రవీందర్, అంగన్వాడీ టీచర్, అత్యధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# విశ్వనాథపల్లిలో ఘనంగా స్కూల్ డే వేడుకలు

**-ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఈఓ జయరాజు**



**ప్రజాపక్షం/కారేపల్లి:** విశ్వనాథపల్లి ప్రాథమిక పాఠశాలలో స్కూల్ డే వేడుకలు, ఐదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం ప్రధానోపాధ్యాయులు భూక్య రాంకోటి రాథోడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి మండల విద్యా శాఖ అధికారి జయరాజు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసగించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని, అన్ని సౌకర్యాలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు గ్రామ సర్పంచ్, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ప్రభుత్వం 21 రకాల వస్తువులతో కూడిన విద్యా కిట్‌ను అందించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు అల్పాహారం సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విశ్వనాథపల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు, కోమట్లగూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శారద, జెడ్‌పిహెచ్ఎస్ విశ్వనాథపల్లి ప్రధానోపాధ్యాయులు పద్మ, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ మమత, పంచాయితీ కార్యదర్శి నాగలక్ష్మి , టీజీటిటిఎఫ్ సింగరేణి మండల అధ్యక్షులు అజ్మీరా వీరునాయక్, ఉపాధ్యాయులు బాసు, బాబు, నాగయ్య, రవి, లక్ష్మి , కమల, ఎంఆర్సీ సభ్యులు లావుడ్యా లక్ష్మ ణ్, సిఆర్పీలు పరమేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రామోత్సవం

**చట్ట వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు - ఎస్ఐ బి. సురేష్**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎవరైనా అపరిచితులు, అనుమానిత వ్యక్తులు గ్రామంలోకి వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్ అన్నారు. గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధి(రెడ్డిగూడెం) ప్రభాత్‌నగర్‌లోని వలస ఆదివాసీ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ బి. సురేష్ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన గ్రామంలో పిల్లలను తప్పని సరిగా స్కూల్ పంపించాలని, చదువుతోనే బంగారు భవిష్యత్‌ను అందుకొంటారని చెప్పారు. దగ్గరలోని పాఠశాలకు పంచించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని అన్నారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని తెలిపారు. ఆదివాసీలు ఎవరు కూడా నక్సలిజం వైపు చూడొద్దని, అలాగే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం నేరమని, చట్ట విరుద్ధమన్నారు. అన్నారు. దీనికి చట్టపరమైన కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఎలాంటి అవసరం వచ్చినా తమను సంప్రదించాలని, దీనితో నిభందనల మేరకు సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉల్వనూర్, లక్ష్మిదేవిపల్లి గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉపాద్యాయులు కొర్స మల్లయ్య, పడిగ సత్యనారాయణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# 14వ వేతన ఒప్పందంపై జేఏసీతో చర్చలు జరపాలి

**-మహిళా కార్మికుల హెచ్చరిక.. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం తీవ్రం**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరహార దీక్ష 14వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా పలువురు నాయకులు మహిళా కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. బుధవారం జరిగిన దీక్షలో తోకలు నరేష్‌తో పాటు ప్లాంటేషన్ మహిళా కార్మికులు బోళ్ల సమ్మక, దార్ల కవిత, పట్రా సుమిత్ర, గంధం సిరి పాల్గొని తమ ఐక్యతను చాటారు. దీక్ష ప్రారంభానికి రామిశెట్టి లక్ష్మి , జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లం నాగయ్య, ఆకినీ సర్వేశ్వరరావు, జేఏసీ సభ్యులు కందాల వెంకట్‌రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, మర్రి వెంకట్‌రెడ్డి, చుక్కపల్లి బాలాజీ, సురిశెట్టి జగదీష్ తదితరులు పూల మాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంటేషన్ మహిళా కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల 14వ వేతన ఒప్పంద చర్చలను తప్పని సరిగా కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ పోరాటాన్ని కొనగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# ఆర్టిజన్‌ల సమ్మె

**పాల్గొన్న 1300 మంది కార్మికులు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి (జేఏసి) ఆధ్వర్యంలో ఆర్టిజన్‌లు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని స్థానిక కెటిపిఎస్ అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం సమ్మె బాట పట్టారు. కేటిపిఎస్‌లో 1800 మంది ఆర్టిజన్‌లకు గాను 1300 మంది సమ్మెలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా జాక్ నాయకులు మాట్లాడుతూ చదువు విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనంతో పాటుగా జెన్‌కోలో విధులు నిర్వహిస్తున్న ర్టిజన్‌లకు క్వార్టర్ సదుపాయం కల్పించాలన్నారు. 04122016 కటాఫ్ డేట్ కలిగిన కాంట్రాక్ట్ కార్మికులను మరియు ఐడి నెంబటర్ కలిగిన కార్మికులనందరిని ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యానికి పలుమార్లు వినతి పత్రాలను అందినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్‌ల నాయకులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలిదశ పనులు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధి తొలిదశ పనులు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో జిల్లా కలెక్టర్, దేవస్థానం ఇఓ దామోదర రావు పాల్గొన్నారు. పనుల పురోగతిపై ఆమే ఈ సందర్భంగా సమీక్షించారు. టెండర్ ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేసి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఆలయంలో జరిగే నిత్య కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ తొలిదశ ఆలయాభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని, పనులను ప్రారంభించి, ఆ పనులపై నిరంతరం పర్యవేక్షన కొనసాగిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఓణీల వేడుకలో పాల్గొన్న మాజీ జెడ్‌పిటిసి దంపతులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పాల్వంచలోని జయమ్మకాలనీలో రిలయన్స్ జియో బంక్ సూపర్వైజర్ శాగల కిరణ్ కుమార్, భవాని దంపతుల కుమార్తె అక్షర, అనూహ్యల ఓణీలు అలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు ముఖ్యంగా హాజరై చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వారి కుమార్తె కామిరెడ్డి మైథిలి కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొగని చిన్నారులను ఆశీర్వదించి వేడుకలను ఆనందంగా జరిపారు.

# మండల తహసీల్దార్‌గా జగదీశ్వర్ ప్రసాద్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండల తహసీల్దార్‌గా జగదీశ్వర్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆళ్లపల్లి తహసీల్దార్‌గా పని చేస్తూ డిప్యూటేషన్‌పై చంద్రుగొండ మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. చంద్రుగొండ మండలంలో విదులు నిర్వహించిన తహసీల్దార సంధ్యారాణి డిప్యూటేషన్‌పై ఆళ్లపల్లి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు నల్లమోతు రమణ, అదే విధంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉద్యోగులు ఆర్థికంగా ఎదిగేలా సొసైటీ కృషి చేయాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** కేటిపిఎస్, బిటిపిఎస్, వైటిపిఎస్ సొసైటీ, టిజి జెన్ కో సంస్థలో ఉద్యోగులు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయాలని, సొసైటీ తోడ్పాటు అందించాలని బిటిపిఎస్ సిఈ బిచ్చన్న కోరారు. బిటిపిఎస్ లో పనిచేస్తున్న భూనిర్వాసిత ఉద్యోగులకు, లోను మొత్తం పెంచే విషయమై సొసైటీ కమిటీ, అభ్యర్థన మేరకు సిఈ సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పెంచాలని బిచ్చన్న సూచించారు. అనంతరం సొసైటీ కమిటీ చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కేసులాల్, వైస్ ప్రెసిడెంట్ వల్లమల్ల ప్రకాష్ రావు, కార్యదర్శి సిద్ది ప్రశాంత్, కోశాధికారి వీరమల్లు రఘు కృష్ణ, రావు, డైరెక్టర్లు సిద్దెల హుస్సేన్, డోలి శ్రీనివాసరావు, సొసైటీ సీఈఓ మాసిరెడ్డి పాల్గొన్నారు.

# రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలని పలువురు పంచాయతీ సర్పంచ్ లు కోరారు. నూతనంగా తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన జీ.రాంప్రసాద్ ను బుధవారం మండలం లోని వివిధ పంచాయతీ సర్పంచ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. తన చాంబర్ లో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయా గ్రామాలలో నెలకొన్న రెవిన్యూ సమస్యల గురించి వివరించారు. వాటి పరిష్కారం కొరకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ లు రాయపూడి రామారావు, బోయిన వేణు, కుక్కల నరేష్, దుద్దెల పవన్, బొడ్డు రాంబాబు, కాంగ్రెస్ నాయకులు గరిడేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని నేలకొండపల్లి తహశీల్దార్ జీ.రాంప్రసాద్ సూచించారు. మండలం లోని మోటాపురం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను బుధవారం సందర్శించారు. కొనుగోలు గురించి నిర్వహాకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కేంద్రం ను వినియోగించుకోవాలని సూచించారు. ఎండ త్రీవత వలన రైతులకు నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏలూరి రామారావు, మండల రెవిన్యూఇన్సెపెక్టర్ అల్లం రవి కుమార్, మోటాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో వాసంశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వం





**-ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పును పునః సమీక్షించాలి**
**-ఏఐఎస్ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పేద విద్యార్థులను ఉన్నత విద్యకు ప్రభుత్వం దూరం చేస్తుందని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, ప్రముఖ విద్యావేత్త రవి మారుత్ తెలిపారు. ఫీజు రీయంబర్స్‌మెంట్స్‌కు సంబంధించి హైకోర్టు తీర్పు సరికాదని దానిని పునః సమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబ్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్స్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడంతో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయన్నారు. జాప్యానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన న్యాయస్థానం విద్యార్థులపై కొరడా ఝుళిపించడం అన్యాయమన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం మారినా పాలన మాత్రం మార లేదన్నారు. సుమారు రూ.10వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. హైకోర్టు ఫీజు బకాయిలకు సంబంధించి విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోమని చెప్పడం ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలని తీర్పునివ్వడం సరైంది కాదన్నారు. తక్షణమే హైకోర్టు తీర్పును పునః సమీక్షించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు చింతల రమేష్, శ్రీనాథ్‌రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు లు మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్య నుంచి దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్స్‌పై ఆధారపడి చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. హైకోర్టు తీర్పు వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్స్ ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్స్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాతంత్ర వాదులను కలుపుకుని ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, షేక నాగులమీరా, బుర్రా మనోజ్, ఆకాష్, జిల్లా నాయకులు పవన్, గోపి, కిరణ్, చైతన్య, రాఘవేంద్ర, నరేష్, సుకుమార్, ఉమామహేష్ పాల్గొన్నారు.

# టిబి నియంత్రణలో ఖమ్మం ప్రథమ స్థానం

**-జిల్లా టిబి ఆసుపత్రికి, గంగారం పిహెచ్‌సికి అవార్డులు**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం టిబి ఆసుపత్రికి, గంగారం పిహెచ్‌సిలకు విశిష్టమైన అవార్డులు దక్కించుకున్నాయి. జిల్లా స్థాయిలో ట్యూబర్క్యులోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమాలు విజయవంతంగా అమలుచేసినందుకు గానూ ఈ గౌరవం లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందిస్తున్న ఖమ్మం డిటిసిఓ సుబ్బారావు, గంగారం పిహెచ్‌సి డాక్టర్ అవినాష్‌లను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డి రామారావు మాట్లాడుతూ ఈ అవార్డు వారు కష్టపడి చేసిన పని, నిబద్ధత, కట్టుబాటుకు వచ్చి గౌరవప్రదమైన గుర్తింపు అని పేర్కొన్నారు. వారి నిరంతర కృషి, సమర్థవంతమైన ఫీల్డ్ స్థాయి అమలు, ప్రజల్లో అవగాహన పెంపు వల్ల ఖమ్మం జిల్లా టిబి నివారణలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇదే విధంగా సేవలందిస్తూ జిల్లాను ఆరోగ్యపరంగా ముందుకు తీసుకెళ్లాలని, సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి కార్యాలయం వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పక్కదారి పడుతున్న స్త్రీనిధి నిధులు

**- అధికారుల పర్యవేక్షణ లోపం**
**- బయటకు రాని మరికొన్ని నిధులు దుర్వినియోగం**
**- అవినీతి తప్పిదాలకు కారకులు ఎవరు?**



**ప్రజాపక్షం/వైరా:** దేవిశ్రీ మండల సమైక్యలో ఏం జరుగుతుంది. వైరా మండలంలో సుమారు 920 డ్వాక్రా గ్రూపులు కొనసాగుతున్నాయి. ఆ గ్రూపుల పర్యవేక్షణ కోసం నాలుగు క్లస్టర్లలో నలుగురు సిసిలు పర్యవేక్షణ ఉంది. సిసిలపై ఏపిఎం, పర్యవేక్షణ,ఏపిఎంపై డిపిఎం పర్యవేక్షణ, డిపిఎంపై ఏపిడి పర్యవేక్షణ, ఏపిడిపై పిడి పర్యవేక్షణ ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా గ్రూపు సభ్యులు వారు తీసుకున్న పొదుపు డబ్బులను తిన్న తినకబోయినా ఉపవాసం ఉన్న ఎన్ని కష్టాలు ఉన్నా ప్రతినెల ఆ సమయానికి తీసుకొచ్చి డబ్బులు కడతారు. గ్రామదీపికలపై ఆధారపడుతూ పదేపదే మోసపోతున్నారని చెప్పవచ్చును. 80% గ్రామదీపికలో వారి విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారు. 20% గ్రామదీపికలో గ్రూపు సభ్యులను మోసం చేస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. వైరా మండలంలో గతంలోనే దేవిశ్రీ మండల సమైక్యలో పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగిందనే శీర్షికను ప్రజాపక్షంలో ప్రచురించడం కూడా జరిగింది. ఒక గ్రామంలో గ్రామదీపిక తప్పు చేస్తుంది. డబ్బులు సక్రమంగా కట్టడం లేదు అని డ్వాక్రా సభ్యులు ఆ క్లస్టర్ పరిధిలోని సిసిలకు ఫిర్యాదు చేస్తే సిసిలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు. అవినీతి జరిగినప్పుడు ఎందుకు బహిర్గతం చేయలేకపోతున్నారు. జరిగిన అవినీతి గురించి ఎవరో వచ్చి చెప్పేంత వరకు ఎందుకు బహిర్గతం చేయలేకపోతున్నారు. ఆడిట్ చేస్తే కొన్ని చోట్ల అవినీతి బయటికి వస్తుంది. మరికొన్ని చోట్ల బయటికి రానికుండా ఉంచడం వెనుక ఆంతర్యం ఏమిటి. జిల్లాస్థాయి అధికారులైన డిపిఎం ఏపిడి పిడి అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదనే వాదన కూడా వినిపిస్తున్నాయి. అవినీతి జరిగిన విషయాన్ని వెంటనే ఎందుకు వారు చర్యలు చేపట్టలేకపోతున్నారు. నారపనేనిపల్లి గ్రామంలో గ్రామదీపిక రూ.12లక్షలు తన అవసరాలకు వాడుకుందని గ్రూపు సభ్యులు చెప్పినప్పటికీ కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదు. గ్రామదీపిక హేమ గ్రూపు డబ్బులు వాడుకున్న విషయాన్ని నారపనేనిపల్లి డ్వాక్రా గూఉప్ప సభ్యులు చెప్పినా కూడా అప్పటి ఏపిఎం, అప్పటి సిసి, ప్రస్తుత సిసి, అప్పటి పిడి ఎందుకు అంత సీరియస్‌గా తీసుకోలేదు. కొన్ని రోజులు తర్వాత పై అధికారులకు ఆడిట్ చేసిన విభాగం అవినీతి జరిగిందని చెబితే అధికారులు కూడా ఎందుకు మందలించలేకపోయారు. అవినీతి జరిగిన సొమ్మును ఎందుకు రికవరీ చేయలేదు అంటే అధికారులు విధి నిర్వహణలో ఎంత నిజాయితీగా ఉన్నారో అర్థమవుతుంది. అవినీతి జరిగిందని ఎక్కడో కొన్నిచోట్ల బయటికి వస్తేనే తెలుస్తుంది తప్ప అసలు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లోపంలో జిల్లా అధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చును. కష్టాన్ని నమ్ముకున్న మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వారి శ్రమను నీటి బొట్టుల కష్టపడి పనిచేసి తీసుకొచ్చి నెల వచ్చేసరికి పొదుపు కడుతుంటే ఆ చెమట చుక్క ద్వారా వచ్చిన డబ్బును దోచుకుంటున్నారు. ఇలా ప్రతిచోట జరుగుతూనే ఉంది. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని జిల్లావ్యాప్తంగా ఉన్న డ్వాక్రా గ్రూపులపై పర్యవేక్షణ అధికారులపై తొలుత చర్యలు తీసుకొని వారిపై కఠినచర్యలకు పాల్పడితే క్రిందస్థాయి నుండి వ్యవస్థ మొత్తం సక్రమంగా ఉంటుంది అనే వాదనను పలు వినిపిస్తున్నారు. వైరా మండలంలో పాలడుగు, సిరిపురం గ్రామాల్లో కూడా డ్వాక్రా గ్రూపుల్లో అవినతి జరిగిందని పలు సార్లు వారిని మందలించిన కూడా ఎలాంటి మార్పు రాలేదని వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని నారపనేనిపల్లిలో జరిగిన డ్వాక్రా గ్రూపులు డబ్బులు అవినీతిపై చర్యలు చేపట్టి డబ్బులు రికవరీ చేసి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సాహిత్యం సమాజ మార్పుకు దోహదపడాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు సాహిత్యం సమాజ మార్పుకు, ఉత్తేజానికి దోహదపడాలని అవనిగడ్డ ఎంఎల్‌ఏ మండలి బుద్ధ ప్రసాద్ కోరారు. బుధవారం వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవ సభను నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ మండలి వెంకటకృష్ణారావు అప్పట్లో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించారని గుర్తు చేశారు. తెలుగు భాష ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుందని దానిని అధిగమించేందుకు కృషి జరగాలన్నారు. తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయడమే వెంకటకృష్ణారావుకు అందించే సరైన నివాళి అన్నారు. ఖమ్మం అంటే దాశరధి కృష్ణమాచార్యులు గుర్తుకు వస్తారని బుద్ధ ప్రసాద్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర అధ్యక్షులు సాధనాల వెంకట స్వామి నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డా॥ గుత్తికొండ సుబ్బారావు, డా॥ జివి పూర్ణచంద్, ఎన్. కాంతేశ్వరరావు, లెనిన్ శ్రీనివాస్, బుక్కా సత్యనారాయణ, గాజుల భారతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయితలు హుస్సేన్, వీరబాబులను సన్మానించారు.

# అలంకరణే...! వెలుగులు లేవా...!

**- చీకటిలో స్టేట్ హైవే**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్ దీపాలు అలంకరణ ప్రాణంగా ఉన్నాయి. విజయవాడ చత్తీస్గడ్ జాతీయ రహదారి విఎం బంజర్, పెనుబల్లి గ్రామాలలో జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అలంకరణగా నిలిచి నిరుపయోగంగా ఉన్నాయి. గత కొంత కాలంగా పెనుబల్లి మండల కేంద్రంలోని రహదారిపై ఉన్న విద్యుత్ లైట్లు ఎరిగిన పాపాన పోలేదు. రాత్రి సమయంలో ఈ రెండు గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయి. ఈ లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు, పాదచారులు భయం గుప్పెట్లో సంచరిస్తున్నారు. హైవే సేఫ్టీ అథారిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు స్థానికల్లో వ్యక్తం అవుతుంది. రోడ్డుకి అలంకరణ ప్రాయంగా మాత్రమే ఉన్నాయని వెలుగులు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. చీకటిలో రహదారి కూడలి వద్ద ఈ మధ్యకాలంలో యూటర్న్ వద్ద ఉన్న డివైడర్ కనిపించక తరుచుగా ప్రమాదాలు సంభవించి పలువురి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. హైవే సేఫ్టీ అథారిటీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న పాపాన పోలేదు. అంధకారంలోనే ఈ రెండు గ్రామాలు మగ్గుతున్నాయి.

# విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, తదితర న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తల్లాడలో విద్యుత్ కార్మికులు బుధవారం సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా టియుసిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ కార్మికులకు ఉద్యమ నాయకుడు కేసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని ఆర్టిజన్లుగా మారుస్తూ స్టాండింగ్ రూల్స్ రూపొందించడానికి వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సమయంలో విద్యుత్ కార్మికులు సమ్మె దిగడం అనేది రాష్ట్రప్రభుత్వానికి తీవ్రంగా నష్టకరమైనది అని వారు అన్నారు. కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పని అడిగిన వెంటనే పని కల్పించాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఉపాధి హామీ పని అడిగిన వెంటనే పని కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మధిర నియోజకవర్గ కార్యదర్శి పాపినేని రామనర్సయ్య కోరారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఆంగోతు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రత, వలసల నివారణలో భాగంగా కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించిన జాతీయ ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసి విజిబి రాంజీ పథకం పేరుతో ఉపాధి కూలీల పొట్టగొట్టే చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఈచట్టానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో కనీసం మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్టులు లేకుండా టెంట్లు లేకుండా వ్యవసాయ కూలీలతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఉపాధి కూలీలకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గామాసు జోగయ్య, రైతు, కార్మిక సంఘాల నాయకులు దివ్వెల వీరయ్య, షేక్.లాల్‌సాహెబ్, మొహిద్దిన్, ఉద్దండు దూదిగం బసవయ్య, నక్కా పుల్లారావు, కోటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.